క్లుప్తంగా

ఆర్డీఓగా శ్రీనివాసరాజు


కడా పీడీని కలిసిన ఆర్డీఓ శ్రీనివాసరాజు

కుప్పం: కుప్పం ఆర్డీఓగా శ్రీనివాసరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసులు బదిలీ కావడంతో ఆయన స్థానంలో భీమవరం నుంచి శ్రీనివాసరాజు కుప్పానికి వచ్చారు. బాధ్యతలు స్వీకరణ అనంతరం కడా ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్‌ను ఆయన కలిశారు. కుప్పం రెవెన్యూ డివిజన్ పరిధిలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

వి.కోటలో ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్మించాలి


మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

వి.కోట: వి.కోట కార్మికులకు ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఈఎస్‌ఐ ఆసుపత్రిని మంజూరు చేయాలని భారత కార్మిక సంఘాల జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక గంగమ్మ ఆలయ ప్రాంగణంలో జిల్లా కార్మిక సంఘాల నాయకులు సమావేశమయ్యారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య చిత్తూరు జిల్లా నాయకుడు చైతన్య మాట్లాడుతూ, వి.కోటలో 5 వేల మందికి పైగా హమాలీలు, భవన నిర్మాణ కార్మికులు, ఆటో కార్మికులు, వివిధ ఫ్యాక్టరీల కార్మికులు ఉన్నారన్నారు. వీరందరికీ వైద్య సౌకర్యం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆస్పత్రిని నిర్మించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హమాలీ కార్మిక నాయకులు తంగరాజ్, అరుణ్, అన్సర్, ఫయాజ్, కార్మికులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై పోరాటం

● సుప్రీంకోర్టు తీర్పుపై మాల మహానాడు నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న మాల మహానాడు నాయకులు

పెద్దపంజాణి: ఎస్సీ వర్గీకరణపై తమ పోరాటం ఆగదని మాల మహానాడు మండల శాఖ అధ్యక్షుడు మంజునాథ్ అన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకు లేదని, పార్లమెంటుకు మాత్రమే ఉందన్నారు. మోదీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి, ఎస్సీలను విడదీసి, వర్గీకరణ చేయాలని చూస్తోందని, మాలలందరూ సంఘటితమై దీనిని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు తిప్పన్న, వెంకటేష్, అమరనారాయణ, శివన్న, మునిరత్నం, శివ, రంగప్ప తిరువలప్ప పాల్గొన్నారు.

పలమనేరు తహసీల్దార్‌గా ఇన్బనాథన్



పలమనేరు: పలమనేరు తహసీల్దార్‌గా ఇన్బనాథన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు డీటీ రుషి వర్మ, సిబ్బంది స్వాగతం పలికారు. ఇక్కడ పనిచేస్తున్న రంగనాయకులు సొంత జిల్లాకు బదిలీ అవడం విదితమే. ఇన్బనాథన్ మాట్లాడుతూ, సోమవారం స్పందనలో అందే అర్జీలు, భూసమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు.

రాతికూసాలు ధ్వంసం చేశారని ఫిర్యాదు


ఆగంతకులు విరిచేసిన రాతికూసాలను చూపుతున్న బాధితుడు

చౌడేపల్లె: గుర్తు తెలియని వ్యక్తులు రాతికూసాలను ధ్వంసం చేశారని చారాల పంచాయతీ జంగాలపల్లెకు చెందిన రమేష్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుని కథనం.. గ్రామానికి సమీపంలోని తన పొలం చుట్టూ రమేష్ రాతి కూసాలు నాటి కమ్మీతో ఫెన్సింగ్ ఏర్పాటుకు పూనుకున్నాడు. ఇంతలో ఆగంతకులు వాటిని ఇష్టానుసారంగా విరిచేసి సుమారు రూ.50 వేల నష్టం కలిగించారని బాధితుడు వాపోయాడు. అనుమానితుల వివరాలను పోలీసులకు తెలియజేసినట్టు చెప్పాడు.

బుస్స్‌స్స్‌స్స్..!


మేటింగ్ సీజన్‌లో పాముల కలయిక

- విష సర్పాల బెడద
- రెండేళ్లలో 32 మందికి పాముకాట్లు
- పదిమంది మృత్యువాత
- నాటు వైద్యంతో ప్రాణాలు కోల్పోతున్న మరి కొందరు
- ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్యం
- సకాలంలో చికిత్స పొందాలంటున్న వైద్యులు

వర్షాలు మొదలవడం, సీజన్ మారడంతో ప్రస్తుతం పాముల బెడద పీడిస్తోంది. ప్రధానంగా వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు పాముకాట్లకు గురవుతున్నారు. ఇటీవల చినిగిపల్లెకు చెందిన రైతు లక్ష్మప్ప పాముకాటుకు గురై నాటు పసర్లు వైద్యం చేయించుకున్నాడు. పరిస్థితి విషమించడంతో కోలారులోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితి విషమించి కన్నుమూశాడు. పెద్దపంజాణి మండలంలోని గుట్టూరు పాముకాటు వైద్యశాలలో(నేచురోపతి) రోజు సగటున నలుగురు పాముకాట్లకు గురైన వారు చికిత్స కోసం వస్తున్నారు. రెండేళ్ల వ్యవధిలో 32మంది పాముకాటుకు గురయ్యారు. పదిమంది మృత్యువాత పడ్డారు.

పలమనేరు: మూడేళ్లుగా విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. దీంతో చెట్లు, పొదలు బాగా పెరిగాయి. దీంతో పాములే కాకుండా తేళ్లు, జెర్రులు, మండ్రగబ్బలు లాంటి విషకీటకాలు బాగా వృద్ధి చెందాయి. వీటి పుట్టలు, ఆవాసాల్లోకి నీళ్లు చేరుతుండడంతో ఇవి పొలం గట్లు, ముళ్లపొదలు, చేలల్లో సంచరిస్తున్నాయి. ఇటీవల కొండచిలువలు సైతం ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం వ్యవసాయ పనులు సైతం ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతో రైతులు పొలం పనుల్లో బిజీగా ఉన్నారు. పొలం పనులు చేస్తున్నప్పుడు, గడ్డికోతలు, రాత్రివేళల్లో పొలానికి నీరుపెట్టడం లాంటి పనులకెళ్లినప్పుడు పాముకాట్లకు గురవుతున్నారు. ముఖ్యంగా ఉదయం కాసే ఎండకు, సాయంత్రం వేళ, రాత్రిపూట ఎక్కువగా పాములు సంచరిస్తుంటాయని స్థానికంగా పాములు పట్టేవాళ్లు చెబుతుంటారు.

ప్రాణాలమీదికి తెస్తున్న నాటు వైద్యం

పాము కరిస్తే ప్రభుత్వాసుపత్రుల్లో పాముకాటుకు విరుగుడు మందులు అందుబాటులో ఉన్నాయి కానీ చాలామంది నాటువైద్యం, ఆకు పసరు వైద్యం, మంత్రాలు, నెత్తిన రాళ్లు పెట్టే విధానాలను పాటిస్తూ ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్నారు.

పాములన్నీ విషపూరితం కావు

వాస్తవానికి పాములన్నీ విషపూరితమైనవి కావు. రెండు కాట్లు ఉంటే అది విషసర్పం కాటుగా గుర్తించాలి. అదే పైన రెండు, కింద మరో రెండు కాట్లు ఉంటే విషరహితమైన పాము కాటుగా భావించాలి. ప్రధానంగా నాగుపాము, రక్తపింజరి, కట్లుపాముల్లో ఎక్కువ విషం ఉంటుంది. వాస్తవానికి చాలామంది పాము కరిచిన వెంటనే తీవ్రమైన ఆందోళనకు గురై ఇక బతకమేమోననే భయంతో మృతి చెందుతుంటారు. పాముకాటుకు గురైన వెంటనే ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయిస్తే వారిలో 99శాతం ప్రాణాపాయం నుంచి గట్టెక్కినట్టే. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ పాముకాటుకు అవరమైన యాంటీ స్నేక్ వీనం మందు అందుబాటులో ఉంది.


ఇటీవల రంగినాయనిపల్లెలో ఇంటిపక్కకొచ్చిన కొండచిలువ(ఫైల్)

> **పాముకాటేస్తే నేరుగా ప్రభుత్వాసుపత్రికి తీసుకురావాలి**
>
> 
>
> ఏపాము కాటుకు గురైనా తొలుత భయాన్ని వీడి ఆత్మస్థైర్యంగా ఉండాలి. పాముకాటుకు గురైన చోట కట్లుకట్టడం, బ్లేడ్‌తో రక్తాన్ని పీల్చడం లాంటి పనులు చేయకూడదు. నాటువైద్యం జోలికెళ్లరాదు. సమీపంలోని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాలి. ఇక్కడ పాము కాటుకు అవసరమైన మందులున్నాయి. ముఖ్యంగా పాముకాటుకు గురైన వారిలో రక్తపువాంతులు, కళ్లు తిరగడం, నీలిరంగులోకి మారడం, బీపీలో హెచ్చుతగ్గులు, పంటి చిగుళ్లలో రక్తస్రావం, శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది లాంటి లక్షణాలుంటాయి.
>
> **డాక్టర్ మమతారాణి, సూపరింటెంటెంట్, ఏరియా ఆస్పత్రి, పలమనేరు**

> **రైతులు పొలాల వద్ద జాగ్రత్తగా ఉండాలి**
>
> 
>
> పాములుండే అవకాశం ఉన్న చోట్లపై రైతులకు అవగాహన ఉంటుంది. ఎక్కువగా పొదలు, నేల కనిపించని స్థలాల్లో పాములుండే అవకాశం ఉంది. రాత్రిపూట పొలాల వద్దకు వెళ్లే రైతులు ఖచ్చితంగా మోకాలివరకు ఉండే బూట్లు వేసుకోవాలి. గజ్జెలు కట్టిన కర్రను వాడాలి. కర్రతో నేలను తాటిస్తూ శబ్దం చేస్తూ వెళితే పాములు దరికి రావు. పొలాల గట్లను చెత్తాచెదారం లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలి. వీలైతే గట్లకు సున్నంచల్లడం కూడా మంచిదే.
>
> **-అన్నపూర్ణదేవి, ఏడీ, వ్యవసాయశాఖ, పలమనేరు**

పాముకాటుతో విద్యార్థినికి అస్వస్థత


తిరుపతిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని

నింద్ర : మండలంలోని కూనమరాజుపాలెం గ్రామానికి చెందిన విద్యార్థిని పాముకాటుతో అస్వస్థతకు గురైంది. గోవిందరాజులు కుమార్తె హర్షిత(13) విజయపురం మండలం పన్నూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. ఆమె గురువారం రాత్రి ఇంటి వద్ద నిద్రించింది. ఆ సమయంలో పాము కాటు వేసింది. గమనించని విద్యార్థిని శుక్రవారం యధావిధిగా పాఠశాలకు వెళ్లింది. విషం ప్రభావం చూపడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఉపాధ్యాయులు వెంటనే ఆమెను తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని పేర్కొంటూ తిరుపతి రుయాకు రిఫర్ చేశారు. ప్రస్తుతం విద్యార్థి రుయాలో చికిత్స పొందుతోంది. విద్యార్థినికి మాటలు రావడం లేదని తల్లిదండ్రులు తెలిపారు.

శిశువుకు ముర్రుపాలే సంజీవని


పలమనేరు: బాలింతకు పౌష్టికాహారం అందజేస్తున్న డాక్టర్లు, ఐసీడీఎస్ అధికారులు


బైరెడ్డిపల్లె: మాట్లాడుతున్న సీడీపీఓ మాధవీలత

-సీడీపీఓ ఇందిరా ప్రియదర్శిని

పలమనేరు: బిడ్డకు తల్లిపాలే సంజీవనిలాంటివని, పుట్టిన శిశువుకు అరగంటలోపు ముర్రుపాలు పట్టించాలని స్థానిక ఐసీడీఎస్ సీడీపీఓ ఇందిరా ప్రియదర్శిని అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఏరియా ఆస్పత్రిలోని బాలింతలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేసి తల్లిపాల ఆవశ్యతను వివరించారు. ఆరునెలల వరకూ తప్పనిసరిగా తల్లిపాలు తప్పకుండా పట్టాలని, దీంతో బిడ్డకు వ్యాధి నిరోధకశక్తి పెరిగి భవిష్యత్తులో వ్యాధులను తట్టుకొనే శక్తి వస్తుందన్నారు.తల్లిపాలలో విటమిన్-ఏ పుష్కలంగా ఉండడంతో కళ్లకు చాలా మంచిదన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ శారద, సూపర్‌వైజర్లు ద్రాక్షాయణి, నజ్మా, అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

తల్లి పాలే శ్రేయస్కరం

బైరెడ్డిపల్లె: ప్రస్తుత మార్కెట్‌లో అన్నీ కల్తీమయం అవుతున్నాయని, ప్రపంచంలో కల్తీకి ఆస్కారం లేనివి, శ్రేష్టమైన తల్లిపాలు మాత్రమేనని సీడీపీఓ మాధవీలత అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం బైరెడ్డిపల్లె అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, పోషకాహార లోపాలు, ఆహార అలవాట్ల కారణంగా ప్రస్తుతం సాధారణ కాన్పులు సాధ్యం కాని పరిస్థితి తలెత్తుతోందని, ప్రతి గర్భిణి సమతుల్య పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యవంతులైన శిశువుకు జన్మనిస్తారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

తల్లి పాలతోనే సంపూర్ణ ఆరోగ్యం

పెద్దపంజాణి: తల్లి పాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యమని పెద్దపంజాణి ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మురళి అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దారికుంట అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను ఆయన వివరించారు. అనంతరం తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం భారతి, ఆశావర్కర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.

తహసీల్దార్ల నియామకం

కుప్పం: కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు తహసీల్దార్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కుప్పం తహసీల్దార్‌గా చిట్టిబాబు అనంతపురం నుంచి, కడప నుంచి శాంతిపురానికి అమర్‌నాథ్, నంద్యాల నుంచి రామకుప్పానికి బాబు, కర్నూలు జిల్లా నుంచి గుడుపల్లెకు రామాంజుల నాయక్ బదిలీ అయ్యారు. త్వరలో వారు బాధ్యతలు స్వీకరిస్తారని అధికార వర్గాలు తెలిపాయి

సెప్టెంబర్14న జాతీయ లోక్ అదాలత్

పుంగనూరు: పట్టణంలోని కోర్టు ఆవరణలో సెప్టెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జ్ సీనియర్ సివిల్‌జడ్జి ఎన్.శిరీష్ తెలిపారు. శుక్రవారం ఆయన కోర్టు ఆవరణలో ప్రీ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈనెల 13వ తేదీ వరకు ప్రీ లోక్ అదాలత్ నిర్వహిస్తామన్నారు. న్యాయవాదులు, కక్షిదారులు లోక్ అదాలత్‌లో అధిక కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని కోరారు.

మాదిగలకు అండగా సుప్రీంకోర్టు తీర్పు

పుంగనూరు: ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మాదిగలకు అండగా ఉందని ఎంఆర్‌పీఎస్ నాయకులు నాగరాజు, గంగరాజు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం డప్పులు కొడుతూ స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుప్రీంకోర్టు తీర్పుతో మాదిగల చిరకాల వాంఛ నెరవేరిందన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు లింగప్ప, వెంకటేశు, అన్నమయ్య, వెంకట్రమణ, నాగభూషణ, రాజగోపాల్, కె.లింగప్ప, మణి తదితరులు పాల్గొన్నారు.


'వర్గీకరణ' సామాజిక వెలివేతే..!

పలమనేరు: ఎస్సీ వర్గీకరణ సామాజిక వెలివేతేనని మాల మహానాడు నాయకులు ఎరబల్లి శ్రీనివాసులు వ్యాఖ్యానించారు. పట్టణంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ రిజర్వేషన్లను తీసుకొచ్చింది షెడ్యూలు కులాలు అంటరానితనం నుంచి బయటపడాలన్నదే ప్రధానోద్దేశమన్నారు. రాష్ట్రాలకు వర్గీకరణ అంశంతో రాజకీయ నాయకులు స్వార్థ రాజకీయాలకు వినియోగించుకోకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు.

కారు వేలం


బంగారుపాళెం: కారు వేలంలో ప్రభుత్వానికి రూ 82,600 ఆదాయం వచ్చిందని సీఐ లక్ష్మయ్య శుక్రవారం తెలిపారు. అక్రమ మద్యం కేసుకు సంబంధించి సీజ్ చేసిన కారును ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం వేసినట్టు చెప్పారు.

కల్యాణం..కమనీయం


.కల్యాణోత్సవ శోభతో ఉత్సవమూర్తులు

కుప్పం: మండలంలో మార్వాడా గ్రామంలోని మైలాడు కొండపై ఉన్న సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో శుక్రవారం కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఆడి మాసం సందర్భంగా నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి భక్త జన సందడి నడుమ కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. పలువురు భక్తులు స్వామి వారికి కావడి మొక్కులు చెల్లించారు. మరికొందరు భక్తులు రథాలు లాగుతూ వచ్చి తమ భక్తిని చాటుకున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం


షార్ట్ సర్క్యూట్ సంభవించిన ఇల్లు, బాధితులు

రొంపిచెర్ల: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ మూలాన లక్ష రూపాయల ఆస్తినష్టం వాటిల్లిన సంఘటన శుక్రవారం స్థానిక హైస్కూల్‌వీధిలో చోటుచేసుకుంది. వివరాలు.. ఎస్. అల్లాబక్ష్ చెందిన ఇంట్లో శుక్రవారం షార్ట్ సర్క్యూట్‌తో మంటలు రేగాయి. దీంతో కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. అప్పటికే ఇంట్లోని ఫ్రిడ్జ్, బీరువా, దుస్తులు, పాతసామగ్రి , రూ.7 వేల నగదు కాలిపోయిందని బాధితుడు తెలిపారు. ఇద్దరు పిల్లలు ఇంట్లో నిద్రిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అయితే సకాలంలో పిల్లలను వెలుపలికి తీసుకురావడంతో ప్రమాదం తప్పింది.

రైతులకు న్యాయపరమైన పరిహారం


తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

- చట్టానికి విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు
- జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

బైరెడ్డిపల్లె: బెంగళూరు–చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవేకు భూములు, ఇంటి స్థలాలు కోల్పోతున్న బాధితులకు న్యాయపరమైన నష్టపరిహారం ఇస్తామని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు ప్రకటించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ మనోజ్‌రెడ్డితో కలిసి ఆయన రైతులకు సమావేశం ఏర్పాటు చేశారు. భూములు కోల్పోతున్న రైతులు మాట్లాడుతూ పలమనేరు–కుప్పం జాతీయ రహదారికి ఆనుకుని భూములు ఉన్న రైతులకు గత ఏడేళ్లుగా న్యాయం చేయడం లేదని వాపోయారు. గతంలో ఉన్న జాయింట్ కలెక్టర్ ఇంటి స్థలాలు కోల్పోయిన బాధితులకు చదరపు అడుగుకు రూ.1560 చెల్లిస్తామని ప్రకటించారని, అయితే ఆ ధరను తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌కు పలు పర్యాయాలు వచ్చి వినతులు అందజేస్తున్నా ఫలితం శూన్యమని నిరసించారు. దీనిపై జేసీ ప్రతిస్పందిస్తూ, చట్టపరిధికి లోబడి న్యాయం చేస్తామని, చట్టానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నష్టపరిహారం తీసుకోవాలని, అనంతరం ఆర్బిటేషన్‌లో న్యాయం చేస్తామన్నారు. మండలంలో ప్రభుత్వ భూములను గుర్తించి తీవ్రంగా నష్టపోయిన రైతులకు భూములు ఇచ్చి న్యాయం చేస్తామన్నారు. రైతులు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ కిశోర్, వీఆర్‌ఓలు, మండల, గ్రామ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

రెండ్రోజుల్లో పెన్షన్ తీసుకోకపోతే హుళక్కే!

● ఇతర ప్రాంతాలకు వెళ్లిన వృద్ధులకు తప్పని పాట్లు

బైరెడ్డిపల్లె: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సామాజిక పింఛన్ల పంపిణీలో లబ్ధిదారులకు అగచాట్లు తప్పడం లేదు. రెండ్రోజుల్లోపు ఎన్టీఆర్ పింఛను కానుక తీసుకోవాలని టీడీపీ ప్రభుత్వ నిర్ణయం తమకు శాపంగా మారుతోందని లబ్ధిదారులు వాపోతున్నారు. జీవనోపాధి రీత్యా కుమారులతో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లిన వృద్ధులు పింఛన్ల కోసం స్వగ్రామాలకు ఉరుకులు, పరుగుల మీద వచ్చారు. ఎన్ని పనులున్నా మానుకుని రెండో రోజు కార్యాలయాల వద్ద పడిగాపులు కాశారు. ఒకటో తేదీ పింఛన్ తీసుకోని వృద్ధులు ఉదయాన్నే సచివాలయం వద్ద రావాలని అధికారులు చెప్పడంతో ఆ మేరకు వచ్చి నిరీక్షించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పింఛన్లు పొందేందుకు లబ్ధిదారులకు ఐదు రోజుల గడువు ఉండేది. అయితే కూటమి ప్రభుత్వం కేవలం రెండు రోజుల గడువు మాత్రమే ఇవ్వడంతో లబ్ధిదారులతో పాటు సచివాలయ ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పింఛన్ సొమ్ముకు కోత పెట్టేందుకు ఇలా చేస్తున్నారని వృద్ధులు శాపనార్థాలు పెట్టారు.

6న హాస్టళ్ల సమస్యలపై ధర్నా


పుంగనూరులో సమావేశమైన ఏఐఎస్ఎఫ్ నాయకులు

పుంగనూరు: ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 6న జిల్లా కలెక్టరేట్ వద్ద చేయతలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక నాయకుడు మున్నా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ప్రవీణ్ మాట్లాడుతూ, సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు రాజ్యమేలుతున్నాయని, వీటిని పరిష్కరించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ధర్నా చేయనున్నట్టు చెప్పారు. అనంతరం పట్టణ ఏఎస్ఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

నూతన కార్యవర్గం

పట్టణ శాఖ అధ్యక్షుడిగా సతీష్, కార్యదర్శిగా మోహన్, ఉపాధ్యక్షులుగా ధనుష్, రాజేష్, ఆసిఫ్‌అలీ, సహాయ కార్యదర్శులుగా రెడ్డి, తేజ, మహిళా కన్వీనర్లుగా జయలక్ష్మి, శిరీష, రాగాంజలి, కోశాధికారిగా మనోజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా నాయకులు సూరి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్ పరికరాల కొనుగోలుకు విరాళం


విరాళం ఇస్తున్న డాక్టర్ మురళీధర్

చౌడేపల్లె: స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలోని స్కూల్ ప్లస్ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవసరమైన ల్యాబ్ పరికరాల కొనుగోలుకు డాక్టర్ మురళీధర్ రూ.60 వేల విరాళంగా అందజేశారని హెచ్ఎం నాగరాజరెడ్డి శుక్రవారం తెలిపారు. ఎంపీసీ విద్యార్థుల సౌకర్యార్థం కోరిన వెంటనే స్పందించి ల్యాబ్ పరికరాల కొనుగోలుకు ఆర్థిక సాయం చేసిన డాక్టర్‌ను విద్యార్థులు, ఉపాధ్యాయులు సత్కరించారు.
కార్యక్రమంలో విజయలక్ష్మి, అమర్‌నాథ్ రెడ్డి, సుధాకర్, సుదర్శన్, మురళి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల వేలం..రూ.2.60 లక్షల ఆదాయం


వేలం నిర్వహిస్తున్న డీఎస్పీ విష్ణు రఘువీర్

బైరెడ్డిపల్లె: మండలంలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన ద్విచక్రవాహనాలు, బొలెరో, కారు మొదలైన వాటిని శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ విష్ణు రఘువీర్ ఆధ్వర్యంలో వేలం వేశారు. 28 మంది నిర్ణీత ప్రవేశరుసుం చెల్లించి వేలానికి హాజరైపాడారు. వేలంలో మొత్తం 2,59,700 రూపాయల ఆదాయం ప్రభుత్వానికి లభించిందని డీఎస్పీ చెప్పారు. కార్యక్రమంలో సీఐ కృష్ణమోహన్, ఎస్ఈబీ శ్రీధర్‌రావు, ఏఎస్ఐ అన్నపూర్ణ పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వండి


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, ఎమ్మెల్యే తదితరులు

- కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు అర్బన్: పారిశుధ్య కార్మికులు ఆరోగ్యం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడమే కాకుండా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేసుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. శుక్రవారం చిత్తూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని కలెక్టర్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, మేయర్ ఎస్ అముద, కమిషనర్ జె అరుణ ప్రారంభించి మాట్లాడారు. నగర, పురపాలక సంఘాల పరిధిలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు క్రమం తప్పకుండా వైద్య శిబిరాలు నిర్వహించి ప్రత్యేక వైద్యులతో వైద్య పరీక్షలు చేయిస్తామన్నారు. అలాగే కార్మికులకు ఆరోగ్య బీమా, జీవిత బీమా సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఏడాదికి రూ.1,500 చెల్లిస్తే రూ.5 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యాన్ని పొందవచ్చని, చిత్తూరు, తిరుపతి జిల్లాలో ఏడు ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్య సేవలు పొందవచ్చన్నారు. నగర, పురపాలక సంఘాల్లో పనిచేసే పారిశుధ్య కార్మికులకు యూనిఫాం, గ్లౌజులు, మాస్కులు, బూట్లు పంపిణీకి చర్యలు తీసుకుంటామన్నారు. తొలిరోజు శిబిరంలో 1–25 వార్డులకు సంబంధించిన పారిశుధ్య, ఇంజినీరింగ్ విభాగం కార్మికులు వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు కమిషనర్ తెలిపారు. అపోలో, ఇతర ప్రైవేట్ ఆస్పత్రులకు చెందిన 14 మంది వైద్య నిపుణులు 10 విభాగాల్లో వైద్య సేవలు అందించారని చెప్పారు. ఈ శిబిరం శనివారం కొనసాగుతుందని, మిగిలిన కార్మికులు కూడా వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. మున్సిపల్ హెల్తాఫీసర్ అనిల్ కుమార్ నాయక్, మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, మాజీ మేయర్ కె.హేమలత, కార్పొరేటర్లు, నగర పాలక అధికారులు పాల్గొన్నారు.